గుడిమల్కాపూర్ డివిజన్ అభివృద్ధికి కృషి: కిషన్‌రెడ్డి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో బీజేపీ నాయకుడు దేవర వంశీ తదితరులు

గోల్కొండ: గుడిమల్కాపూర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం గుడిమల్కాపూర్ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు ఆయనను కలిశారు. కేంద్ర మంత్రిగా మళ్లీ మరోసారి నియమితులైన సందర్భంగా ఆయనను అభినందించారు. ఈసందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ..పార్లమెంటు సమావేశాల అనంతరం గుడిమల్కాపూర్ డివిజన్‌లో పర్యటించి ప్రజలను కలుసుకుంటానన్నారు. సికింద్రాబాద్ నుంచి తనను గెలిపించిన ఓటర్లకు తాను ఎప్పుడు రుణపడి ఉంటానన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్ఎస్ పార్టీని గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు గట్టి గుణపాఠం నేర్పారని ఆయన పేర్కొన్నారు. అవకతవక విధానాలతో రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ సైతం భూస్థాపితం కావడం ఖాయమన్నారు. బండారి శ్రీనివాస్, అనిల్‌కుమార్ తదితరులున్నారు.

వైభవంగా ఆలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు


పూజల్లో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్, మహేశ్వరం శ్రీనివాసచారి తదితరులు

దూద్‌బౌలి: దూద్‌బౌలిలోని సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి, సీతారామ వీరాంజనేయ స్వామి ఆలయంలో 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 22న ఉదయం గణపతి పూజతో ప్రారంభమై కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ తదితర పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ వార్షిక బ్రహ్మోత్సవాల్లో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మహేశ్వరం శ్రీనివాసచారి ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య శర్మ, ధార్మిక సలహాదారులు చల్లా మల్లికార్జున శర్మ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగులకు అన్యాయం


మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాలిగ

సుల్తాన్‌బజార్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని తెలంగాణ రికగ్నైజ్డ్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ అండ్ కంప్యూటర్ అసోసియేషన్ ఆరోపించింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో అయిన గ్రూప్–3, గ్రూప్–4 నోటిఫికేషన్స్‌లో టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను ప్రకటించాలని సీఎం రేవంత్‌రెడ్డిని అసోసియేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. జనవరిలో తమిళనాడులో 2 వేల టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను ప్రభుత్వం ప్రకటించి నిరుద్యోగులను ఆదుకుందని వారు గుర్తు చేశారు. ఈ విషయాన్ని తెలంగాణ ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని తమిళనాడు తరహాలో రాష్ట్రంలో టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ నిరుద్యోగులను ఆదుకోవాలని వారు కోరారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాలిగ, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, కోశాధికారి వివేక్ మాట్లాడారు. గ్రూప్–2, గ్రూప్–3 నోటిఫికేషన్లలో ప్రభుత్వం టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులు పెంచాలని, 5 ఏళ్లకు ఒక సారి రిలీజ్ చేసే జంబో నోటిఫికేషన్ ఇచ్చి 5, 6 పోస్టులు ఇచ్చి నిరుద్యోగులను నిరాశపరుస్తున్నాయన్నారు. ఎస్‌బీటెట్‌లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి టైప్ ఇనిస్టిట్యూట్ నిరుద్యోగులను ఆదుకోవాలని ఎస్‌బీటెట్ సెక్రెటరీ పుల్లయ్య, చైర్మన్ బుర్ర వెంకటేశంకు విజ్ఞప్తి చేశారు.

'మొబైల్ టీమ్ డీసీటీఓ జగన్‌మోహన్‌పై చర్యలు తీసుకోవాలి'

అబిడ్స్: వాణిజ్యపన్నుల శాఖ చార్మినార్ డివిజన్ మొబైల్ టీమ్ డీసీటీఓ జగన్‌మోహన్‌పై చర్యలు తీసుకోవాలని బేగంబజార్ సర్కిల్ డీసీటీఓ సదాలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి చీఫ్ సెక్రెటరి శాంతకుమారి, కమిషనర్ టీకే శ్రీదేవికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈనెల 19న గోషామహల్ రవి పెట్రోల్ పంప్ వద్ద వాహనాల తనిఖీ తాను చేస్తుండగా చార్మినార్ డివిజన్ మొబైల్ టీమ్ డీసీటీఓ జగన్‌మోహన్ అక్కడికి వచ్చి తనపై పలు విధాల దురుసుగా ప్రవర్తించారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటలకు గోషామహల్ రవి పెట్రోల్‌పంప్ వద్దకు వచ్చిన జగన్ మోహన్ తాను వాహనాల తనిఖీ చేస్తుంటే అడ్డుకున్నారని డీసీటీఓ సదాలక్ష్మి మీడియాకు వివరించారు. ఎందుకు తనిఖీలు చేస్తున్నావంటూ గుట్కా వాహనాలు కానీ, పాన్‌మసాల వాహనాలు కానీ, ట్రాన్స్‌పోర్ట్‌గాని తనిఖీ చేయొద్దంటూ తనపై ఒత్తిడి తెచ్చారని ఆమె పేర్కొన్నారు. డీసీటీఓ మహిళా అధికారిగా విధులు నిర్వహిస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని పోలీసులు ఆయనను ప్రశ్నించడంతో అప్పుడు ఆయన తిరుగుముఖం పట్టారని డీసీటీఓ సదాలక్ష్మి వివరించారు. చార్మినార్ డివిజన్ జాయింట్ కమిషనర్ రాజేష్‌కుమార్ ఇచ్చిన ఆదేశాల మేరకే తాను తనిఖీలు చేసినట్లు తెలిపారు. తాను న్యాయపరంగా విధులు నిర్వహిస్తుంటే తనపై దౌర్జన్యానికి పాల్పడిన జగన్‌మోహన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె తన ఫిర్యాదులో తెలిపారు. అదేవిధంగా వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు కాని జగన్‌మోహన్ తీరుపట్ల విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సదాలక్ష్మి పేర్కొన్నారు.

వీనుల విందుగా సంగీత విభావరి


శాస్త్రీయ సంగీతాన్ని ఆలపిస్తున్న గాయని రోంకిణి గుప్తా తదితరులు

విజయనగర్‌కాలనీ: వీనుల విందు అయిన శాస్త్రీయ సంగీతం, గానం వినసొంపు అయిన పాటలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆడిటోరియం హాల్‌లో శనివారం రాత్రి వరకు నిర్వహించిన శాస్త్రీయ సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. సూర్యమండల్, తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంగీత విభావరిలో ప్రముఖ శాస్త్రీయ గాయకురాలు రోంకిణి గుప్తా ఆలపించిన గానం ప్రేక్షకులను ఆకట్టుకుంది. హిందుస్థానీ, శాస్త్రీయ సంగీతాన్ని ఆస్వాదిస్తూ ప్రేక్షకులు తన్మయులయ్యారు.

'వృద్ధులు, దివ్యాంగులకు అండగా ఉంటా'



గోల్కొండ: వృద్ధులు, దివ్యాంగులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన నానల్‌నగర్, టోలిచౌకీ తదితర డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకున్నారు. నీరజ్ కాలనీలో ఓ వృద్ధ వికలాంగుడిని చూసి ఆయన పలకరించారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ.. ఆయన ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకునే వారు మధ్యవర్తుల మాటలు నమ్మొద్దని ఆయన అన్నారు. మీసేవ కేంద్రాలకు వెళ్లి సరైన వివరాలు తెలుసుకొని అవసరమైన ధ్రువపత్రాలతో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షుడు ఆరుస్‌ఫరాన్, నాయకులు అబిబ్ చౌష్, ఆలీముద్దీన్ తదితరులున్నారు.

మీరాలంమండిలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్


రోడ్లపై ఏర్పాటు చేసిన వస్తువులను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

చార్మినార్: మీరాలంమండిలో తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలను తొలగించడానికి మీర్‌చౌక్ ట్రాఫిక్ ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి ఆదివారం ఉదయం మీరాలంమండి ప్రధాన రోడ్డులో పర్యటించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ట్రాఫిక్ సమస్యలతో పాటు రోడ్డును ఆక్రమించి అక్రమంగా వ్యాపారాలు కొనసాగిస్తున్న వ్యాపారస్తులను కట్టడి చేయాలని కోరుతూ ఇప్పటికే వచ్చిన ఫిర్యాదుల మేరకు తాము ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. దుకాణాల ముందు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న వస్తువులను వెంటనే తొలగించాలని తాము సంబంధిత స్థానిక వ్యాపారస్తులకు సూచించినట్లు తెలిపారు.

వ్యాపారులతో సమావేశమైన మజ్లిస్ కార్పొరేటర్..

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్ విషయం తెలుసుకున్న పత్తర్‌గట్టి మజ్లిస్ పార్టీ కార్పొరేటర్ సొహేల్ ఖాద్రీ హుటాహుటిన మీరాలంమండికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మీరాలంమండి ఫ్రూట్ గ్రెయిన్ అండ్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల అంజయ్యతో పాటు మరికొంత మంది స్థానిక వ్యాపారులతో సమావేశమయ్యారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తితే వినియోగదారులతో పాటు వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతాయని.. దీనిని నివారించడం కోసం సంబంధిత అధికారులతో పాటు స్థానిక వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించి తగిన చర్యలు తీసుకుందామని వారికి తెలిపారు.

భారీ వర్షం.. రోడ్లు జలమయం

వాహనాల రాకపోకలకు అంతరాయం


డబీర్‌పురాలో స్తంభించిన ట్రాఫిక్


బాపూఘాట్ సమీపంలో..


వరద నీటిలో నిలిచిపోయిన ద్విచక్ర వాహనాలు

చార్మినార్: పాతబస్తీలో ఆదివారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. లోతట్టు రోడ్లలో వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులకు తిప్పలు తప్ప లేదు. బీబీబజార్ చౌరస్తా, యాకుత్‌పురా రైల్వే అండర్ బ్రిడ్జి, జోహర్ బీ కా దర్గా రైల్వే అండర్ బ్రిడ్జ్, ఆజంపురా అండర్ బ్రిడ్జ్ రోడ్లలలో నాలుగైదు అడుగుల వరకు నలువైపులా వరదనీరు నిలిచిపోవడంతో అటువైపు నుంచి రాకపోకలు సాగించిన వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. వరద నీటిలో ద్విచక్రవాహనాలు మునిగిపోయి.. ముందుకు వెళ్ల లేక మోరాయించాయి. గంట పాటు జోరుగా కురిసిన వర్షానికి వాహనదారులు తమ వాహనాలను నెట్టుకుంటూ వెళ్లాల్సిన దుర్భర పరిస్థితులు కనిపించాయి.

డబీర్‌పురాలో..

డబీర్‌పురా: డబీర్‌పురాలో ఆదివారం సాయంత్రం గంట సేపు కురిసిన భారీ వర్షానికి రెండున్నర గంటల పాటు ఎక్కడి వాహనాలు అక్కడే రోడ్డుపై నిలిచిపోయాయి. డబీర్‌పురా దర్వాజా ప్రధాన రోడ్డులో డబీర్‌పురా రైల్వే ఓవర్ బ్రిడ్జి రోడ్డు వరకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. యాకుత్ పురా, బ్రహ్మణ వాడి, డబీర్‌పురా షేక్ ఫాజ్ కమాన్ తదితర ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరు ఇక్కడే నిలిచి పోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి.

లంగర్‌హౌస్‌లో..

లంగర్‌హౌస్: జోరువానకు రోడ్లు చెరువులను తలపించాయి. లంగర్‌హౌస్‌లో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఎక్కడ గుంతలు, విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉందో అని వాహనదారులు, పాదచారులు భయంతో ముందుకు సాగారు. లంగర్‌హౌస్ బాపూఘాట్ ఎదురుగా, జీషాన్ హోటల్ వద్ద, సంగం కొత్త బ్రిడ్జి ముందు, మొఘల్‌నగర్ రింగ్ రోడ్డు వద్ద ప్రధాన రహదారులు చెరువులుగా మారాయి.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి


గౌరీ సతీష్

అబిడ్స్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని దేశంలో ఎక్కడ లేని విధంగా రైతాంగానికి రూ.2 లక్షల రుణ మాఫీ ప్రకటించిందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. శనివారం తన కార్యాలయంలో గౌరీ సతీష్ మాట్లాడుతూ..గతంలో పదేళ్లు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం రైతులకు గుదిబండగా మారిందన్నారు. వరి ఉరితో సమానమని అప్పట్లో కేసీఆర్ పేర్కొనడం సిగ్గుచేటన్నారు. రైతులతోనే దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందిన గౌరీ సతీష్ పేర్కొన్నారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ ప్రభుత్వం ప్రకటించిందని ఆయన అన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక




గోల్కొండ/జియాగూడ: కార్వాన్‌లోని క్రాంతి భవనంలో సేవా సమితికి నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటయ్యింది. అధ్యక్షుడిగా పడాల అనంతకృష్ణ, ఉపాధ్యక్షుడిగా రావుల రాఘవేంద్ర, ప్రధాన కార్యదర్శిగా ఎస్.శ్యామ్‌లింగం, సహకార్యదర్శిగా రావుల పవన్‌కుమార్, కోశాధికారిగా నల్ల నర్సింగ్‌రావు, స్పోర్ట్స్ కార్యదర్శిగా ఎర్రోళ్ల శ్రీకాంత్, కల్చరల్ కార్యదర్శిగా పొట్టి పోచ్చాల లల్లూలు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పడాల రమేష్, పాశం ప్రణయ్‌రామ్, జితేష్‌శర్మ, పానుగంటి వెంకటేశ్వర్‌రావు, నల్వడే మహేశ్వర్, ఏ.వెంకటేశ్వర్ తదితరులు ఎన్నికయ్యారు.

సన్మానం



గౌలిపురా: యాకుత్‌పురా నియోజకవర్గం బీజేపీ కన్వీనర్‌గా బండా వెంకటరెడ్డి నియమితులైన సందర్భంగా ఆదివారం గౌలిపురా మార్కెట్‌లోని ఆలే నరేంద్ర నివాసంలో గౌలిపురా కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆలె భాస్కర్ రాజ్, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు జి.రఘుకాంత్, జమాల్‌పూర్ అశోక్, మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాల ప్రదానం



సినీనటుడు సుమన్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి పురస్కారాలను ఇవ్వడం వల్ల వారిలో ఉత్తేజాన్ని నింపడంతో పాటు ఇతరులకు స్ఫూర్తిగా ఉంటుందని సినీ నటుడు సుమన్ అన్నారు. ఆదివారం ఆదర్శ్‌నగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సినీ నటులు సిద్ధార్థ్ రాజ్, శశికాంత్, ఫిట్నెస్ నిపుణురాలు అణుప్రసాద్, సంస్థ వ్యవస్థాపకురాలు విజయ మాధవి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి


నాగేందర్, గిరిధర్, కమిటీ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: గుడిమల్కాపూర్ సాయిబాబా ఆలయం నూతన అధ్యక్షుడిగా కె.నాగేందర్ నియమితులయ్యారు. ఆదివారం ఆలయ ఆవరణలో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా నాగేందర్, ఉపాధ్యక్షుడిగా బి.గిరిధర్, ప్రధాన కార్యదర్శిగా జె.అశోక్, జాయింట్ సెక్రెటరిగా బాబాగౌడ్, కోశాధికారిగా ఎం.మహేష్, కల్చరల్ సెక్రెటరీగా సత్యప్రకాష్, ఎడ్యుకేషన్ సెక్రెటరిగా ఎం.మహేష్, స్పోర్ట్స్ సెక్రెటరిగా పి.నాగేందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాగేందర్ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేపడుతామన్నారు. అన్ని పర్వదినాలు, ఇతర పండుగలకు ఆలయంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసి వారికి ఆలయ కమిటీ తరపున పలు సౌకర్యాలు కలిపిస్తామన్నారు. ఈ సందర్భంగా నూతన ఆలయ కమిటీని ఘనంగా సత్కరించారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ భీశ్వ సురేఖ తదితరులు


నివాళులర్పిస్తున్న మహేశ్వర్, పురుషోత్తం


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

జియాగూడ: భారతదేశం అఖండ్ భారత్‌గా ఉండాలని జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ ఎంతో పరితపించాడని బీజేపీ రాష్ట్ర గొర్లకాపరుల సెల్ కో కన్వీనర్ దర్పల్లి నర్సిములు, గోల్కొండ జిల్లా డెయిరీ సెల్ కన్వీనర్ శివకుమార్‌యాదవ్ అన్నారు. నవోదనగర్‌లో దివంగత డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జి వర్ధంతి వేడుకలను బలిదాన్ దివస్‌గా జియాగూడ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటైంది. ఈ కార్యక్రమానికి హాజరైన వారు ముఖర్జి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు మాణిక్ ప్రభు, రమేష్ చౌగ్లే సంతోష్, రాజ్‌పోల్, నరేష్, శివశంకర్, కిషన్‌దామ, తదితరులు పాల్గొన్నారు.

అబిడ్స్‌లో..

అబిడ్స్: డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. అబిడ్స్ బషీర్‌బాగ్ గన్‌ఫౌండ్రీ ప్రాంతాల్లో కార్పొరేటర్ డాక్టర్ భీశ్వ సురేఖ, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశ్వ ఓంప్రకాష్ ఆయన చిత్రపటాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలు కొనియాడారు.

రెయిన్ బజార్‌లో..

యాకుత్‌పురా: శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దినోత్సవం సందర్భంగా ఆదివారం బీజేపీ రెయిన్ బజార్ డివిజన్ అధ్యక్షులు పురుషోత్తం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ మహేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరై ఆయన చిత్రాపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జ్ఞానేశ్వర్, ఈశ్వర్‌యాదవ్, సాయిరాం, రాజేష్, ఆరవింద్ చారి, వికాస్ పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా హైదరాబాద్ అభివృద్ధి


అసదుద్దీన్ ఒవైసీని సన్మానిస్తున్న మహ్మద్ ఇలియాస్ బుకారి

చార్మినార్: కులమతాలకతీతంగా హైదరాబాద్ అభివృద్ధి జరుగుతోందని.. ఇందుకు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కృషి ఎంతో ఉందని మహ్మద్ క్యాప్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇలియాస్ బుకారీ అన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులుగా 5వ సారి భారీ మెజార్టీతో విజయం సాధించిన మజ్లిస్ పార్టీ చీఫ్ అసదుద్దీన్ ఒవైసీని ఆయన ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇలియాస్ బుకారీ మాట్లాడుతూ..ఈ నెల 24న ఎంపీగా బాధ్యతలు చేపట్టనున్న సందర్భంగా అసదుద్దీన్ ఒవైసీని కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరానికి ఎంతో ప్రాధాన్యత, ప్రత్యేకత ఉందని.. చారిత్రాత్మకమైన నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరుగుతోందన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

గోల్కొండ: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో గోల్కొండ, లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్లలో రౌడీషీటర్లుగా నమోదై ఉన్న వారికి, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక కుటుంబంలో ఒక రౌడీషీటర్ ఉంటే ఆ కుటుంబానికి వారి బంధువులకు సమాజంలో మంచి గుర్తింపు ఉండదని అన్నారు. పోలీసులు నిర్వహిస్తున్న ఈ కౌన్సెలింగ్ వల్ల ఎందరో తమ ప్రవర్తనను మార్చుకున్నారని, గౌరవ ప్రథంగా జీవించాలంటే సత్ప్రవర్తన ఎంతో ముఖ్యమన్నారు. కౌన్సెలింగ్‌లో గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు తదితరులున్నారు.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



చాంద్రాయణగుట్ట: ఆషాఢ మాసంలో వైభవంగా జరిగే బోనాల జాతర ఉత్సవాల కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.20 కోట్లు మంజూరు చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, లాల్‌దర్వాజా ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కె.వెంకటేష్ ధన్యవాదాలు తెలియజేశారు. ఇటీవలే లాల్‌దర్వాజా ఆలయ కమిటీ తరపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి బోనాల ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని కోరడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చెప్పిన మాదిరిగానే అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఉత్సవాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశాలివ్వడం సంతోషకరమన్నారు.

రెయిన్‌బజార్‌లో ఎమ్మెల్యే పర్యటన



యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి బస్తీల్లో పర్యటిస్తున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. ఆదివారం ఆయన రెయిన్‌బజార్ డివిజన్‌లోని యాకుత్‌పురా, రైల్వేస్టేషన్, ఎస్ఆర్టీ కాలనీ, మదీనా నగర్, దోభీఘాట్, మౌలా కా చీల్లా తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెయిన్ బజార్ డివిజన్‌లోని బస్తీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



అఫ్జల్‌గంజ్: గోషామహల్ నియోజకవర్గంలో అర్హులైన వారికి కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ శశికళ కృష్ణ పంపిణీ చేశారు. దాదాపు 40 మందికి ఈ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ధూల్‌పేట్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తెలిపిన వెంటనే పరిష్కారం చేస్తామన్నారు.

రక్తదాన శిబిరం


శిబిరంలో పాల్గొన్న దిలీప్‌కుమార్ గుప్తా, రాజేందర్‌కుమార్ గుప్తా

అఫ్జల్‌గంజ్: మాధుర్ వైశ్యశాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దీక్షా హాస్పిటల్ బ్లడ్‌బ్యాంక్ కోసం ఈ రక్తదాన శిబిరం చేపట్టారు. మాధుర్ వైశ్య శాఖ రాష్ట్ర నాయకులు దిలీప్‌కుమార్ గుప్తా, రాజేందర్ గుప్తా ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రక్తదానం మహాదానంతో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో రామ్ నివాఖ గుప్తా, అజయ్, మహేష్, మనోజ్ గుప్తా, సునీత గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నివాళి


సంజయ్‌గాంధీ, వీవీ గిరి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న మనిలాల్ షా

అఫ్జల్‌గంజ్: దివంగత కాంగ్రెస్ అగ్రనాయకుడు సంజయ్‌గాంధీ, మాజీ రాష్ట్రపతి వీవీ గిరి వర్ధంతి వేడుకలు నిర్వహించారు. గాంధీ భవన్‌లో వారి చిత్రపటాలకు టీపీసీసీ కార్యదర్శి మనిలాల్ షా, రాష్ట్ర నాయకులు కుమార్‌రావ్, ప్రేమలత అగర్వాల్, పురుషోత్తమ్ గుప్తా, శేఖర్ యాదవ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ నాగదుర్గా ప్రసాద్

గౌలిపురా: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ రౌడీషీటర్లకు హెచ్చరించారు. పాతబస్తీలో ఇటీవల జరుగుతున్న హత్య నేపథ్యంలో ఆదివారం స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నాగదుర్గా ప్రసాద్ మాట్లాడుతూ..అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై తిరుగుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

నేటి నుంచి 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో సమగ్ర సర్వే


షబ్బీర్ అహ్మద్

శాలిబండ: పాతబస్తీలోని ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు సోమవారం 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో సమగ్ర సర్వే చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ చందులాల్ బారాదరి ఏఈ షబ్బీర్ అహ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలో ఉన్న ప్రతి గల్లీ తిరిగి ప్రతి స్తంభం పూర్తి వివరాలను ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన యాప్‌లో నమోదు చేస్తామని వెల్లడించారు. డీఈ, ఏడీఈ, ఏఈ నుంచి ఆర్టిజన్ వరకు క్షేత్రస్థాయిలో బస్తీబాట నిర్వహిస్తున్నామని తెలిపారు.

రౌడీషీటర్‌పై కేసు నమోదు

నాంపల్లి: యూట్యూబర్‌ను బెదిరించిన కేసులో రౌడీషీటర్‌పై హబీబ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మెహిదీపట్నంలో నివాసం ఉండే గౌస్‌వుద్దీన్ కుమారుడు జియావుద్దీన్ (44) జడ్9 ఉర్దూ న్యూస్ పేరిట యూట్యూబ్ ఛానల్‌ను నిర్వహిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి అడిషనల్ డీసీపీ అశ్వాక్, స్థానిక హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు తన సిబ్బందితో కలిసి రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టేందుకు విధుల్లో భాగంగా రౌడీషీటర్ జంగ్లీ యూసుఫ్ ఇంటికి వెళ్లారు. ఒక్కసారిగా పోలీసులు, మీడియా అక్కడికి చేరుకోవడంతో రౌడీషీటర్ జంగ్లీ యూసుఫ్ పోలీసులు, యూట్యూబ్ ఛానల్స్ రిపోర్టర్ల మీద దుర్భాషలాడారు. ఈ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న జడ్9 ఉర్దూ న్యూస్ ఛానల్ నడుపుతున్న జియావుద్దీన్‌పై ఆక్రోశాన్ని వెల్లగక్కారు. నీ అంతు చూస్తానని బెదరించారు. తనకు జంగ్లీ యూసుఫ్‌తో ప్రాణహాని ఉందంటూ జియావుద్దీన్ హబీబ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు రౌడీషీటర్‌పై కేసు నమోదు చేశారు.